క్లుప్తంగా

పరామర్శ..



ఎంఈఓ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలం జీజీ వలస గ్రామానికి చెందిన ఎంఈఓ లండ ఈశ్వరరావు ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. లావేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పదాల పాపారావు తల్లి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ ఇనుపకుర్తి సతీష్, వైస్ సర్పంచ్ పైడి దాము, నాయకులు దుర్గాసి రామరావు, లంకలపల్లి మహేష్, కె.త్రినాథరావు, తార అప్పలరాజు, ఇనపకుర్తి రాంబాబు, తలారి నాగయ్య, మహదాసు చక్రధదర్, దుర్గారావు, దోరవెంకటి, నారాయణరావు పాల్గొన్నారు.

81 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కాలేజీలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 81 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన యువతకు డోనర్ కార్డు, సర్టిఫికెట్ అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మశ్రీ, రెడ్ క్రాస్ జాతీయ అవార్డు గ్రహీత పెంకి చైతన్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది

జి.సిగడాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వాండ్రంగి సర్పంచ్ సాకేటి నాగరాజు, ఐసీడీఎస్ సంతవురిటి సెక్టార్ సూపర్‌వైజర్ కుప్పిలి ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం వాండ్రంగిలో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పౌష్టిక ఆహారాన్ని ప్రదర్శించారు. మండల నాయకులు బూరాడ వెంకటరమణ, బి.భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి వడగ గౌరీ శంకరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈసర్ల కల్యాణి, రేగిడి రమణమ్మ ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణంతో తెగుళ్ల నియంత్రణ



జిల్లేడు ద్రావణం తయారు చేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లేడు ద్రావణంతో తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చంద్రకళ, ప్రసాద్ సూచించారు. మెట్టపేటలో జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. 200 లీటర్ల ద్రావణం తయారు చేశారు. నాలుగు రోజులు నిల్వ ఉంచి ఈ ద్రావణం వరి పంటకు పిచికారీ చేయాలని సూచించారు. పంటకు తెగుళ్ల నియంత్రణతోపాటు పొటాస్, నత్రజని లోపాలు నిర్మూలన జరుగుతుందన్నారు. పసుపు రేకు నుంచి సైతం విముక్తి లభిస్తుందన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పైల రవికుమార్ మరో ముగ్గురితో కలిసి ఎలిమెంట్స్ ఆఫ్ లిటరరీ థియరీ పుస్తకాన్ని రాశారు. ఈ పుస్తకాన్ని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వీసీ రజని, వర్సిటీ అధికారులు బుధవారం ఆవిష్కరించారు.

• దర్శనం



విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథున్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు బుధవారం దర్శించుకున్నారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల క్యూలైన్లు, మధ్యాహ్న అన్న ప్రసాదం పథకంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈవో గురునాథం, అర్చకులు ఉన్నారు.

-గార

• శుభరాట



శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధిలో వేంచేసిన లలితాదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దేవీ నవరాత్రుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుభరాట మహోత్సవం జరిగింది. అర్చకులు, షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపటాటరు.

-శ్రీకాకుళం కల్చరల్

• పొలం పిలుస్తోంది



కనుగులవానిపేట, నైరా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు బుధవారం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునే సూచనలను మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి రైతులకు సూచించారు.

-శ్రీకాకుళం రూరల్

సాగునీటి కష్టాలు



పొందూరు మండల పరిధిలోని కాలువలో యంత్రాలతో తూటిక తివ్వ తొలగిస్తూ..



కుశాలపురం సమీపంలో నవభారత్ వద్ద కాలువ దుస్థితి ఇలా..

ఎచ్చెర్ల క్యాంపస్:

నారాయణపురం కుడి కాలువ కింద ఉన్న రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండటం లేదు. మే, జూన్ నెలల్లో కాలువల మరమ్మతులు చేపట్టకపోవడం, ఆయకట్టు దగ్గర ఉన్న ఇసుక మేటల తొలగించకపోవటం శాపంగా మారింది. గత 20 ఏళ్లలో ఎప్పుడూ లేని సాగునీటి కష్టాలు ప్రస్తుతం వెంటాడుతున్నాయి. సంతకవిటి, పొందూరు మండలాల తరువాత ఎచ్చెర్ల మండలానికి సాగునీరు వస్తోంది. ఎచ్చెర్ల మండల పరిధిలోని ఫరీదుపేట నుంచి ఓలేటిఅగ్రహారం వరకు 13 గ్రామాల్లోని 7,175 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ప్రస్తుతం జలవనరులు శాఖ అధికారులు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నా సాధ్యం కావటం లేదు. ఈ ఏడాది పంటలు పరిస్థితి ఎలా ఉంటుందో అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

• కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



పట్టాలను పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

శ్రీకాకుళం రూరల్: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మండల పరిధిలోని కుందువానిపేట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుందువానిపేట బీచ్ తీరం వెంబడి ఎంపీ నిధులతో సోలార్ దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్‌లో భాగంగా దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని చెప్పారు. మూలపేట పోర్టు పూర్తయితే మత్స్యకారులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం పలువురికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, సర్పంచ్‌లు సూర్యం, అప్పన్న పాల్గొన్నారు.

బాలుకు స్వర నీరాజనం



బాలు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గాయకులు



గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సిక్కోలు ఫ్యూచర్ సింగర్స్ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా స్వరనీరాజనం చేశారు. గాయకులు కాళ్లకూరి మధుకుమార్, సాయిబాబా, బాబూరావు, రాజమోహన్, మార్గదర్శి శ్రీను, బాలు, హరిప్రసాద్, ఉమా, హరిత, జోత్స్న, మహేశ్వరి తదితరులు బాలు పాడిన క్లాసికల్, డ్యూయెట్‌లు, సోలో సాంగ్స్‌ను చక్కగా ఆలపించారు. గురువారం ఉదయం నుంచి కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ఉదయం ఔత్సాహిక గాయకులకు పాటల పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం సభ నిర్వహించి అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎల్.రామలింగస్వామి, కె.ఎల్.ఎన్.మూర్తి, కల్యాణం రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

కొత్తకూలీ అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న కలాసీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూలి పెంచాలని వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కమిటీ చేసిన ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి నుంచి కొత్త కూలి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలి ముఠా యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.శ్రీమన్నారాయణ కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద కలాసీలంతా నల్ల రిబ్బన్లను కళ్లకు కట్టుకొని బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. హామీనిచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికి ఎటువంటి జీవోలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దశలవారీ ఆందోళన నిర్వహించడానికి తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంఎల్ఎస్ పాయింట్ హమాలీ యూనియన్ మేస్త్రిలు, హమాలీల జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కాల గోవిందరావు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఐఏఎస్ అధికారులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న పలువురు ఐఏఎస్ అధికారులు బుధవారం దర్శించుకున్నారు. ల్యాండ్స్ అండ్ రెవెన్యూ ప్రిన్సిపల్ డైరెక్టర్ (అసోం) శ్యంతన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఆడిట్ ప్రిన్సిపల్ డైరెక్టర్ సుహాసినిలకు ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ కావ్య తదితరులున్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం పట్టణం నుంచి విశాఖపట్నం వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ బుధవారం తెలిపారు. నవభారత్ సమీపంలో టిప్పర్ పట్టుకొని స్టేషన్‌కు తలించామన్నారు. ట్రిప్పర్ డ్రైవర్‌కు స్టేషన్ బెయిల్ మంజూరు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యం



గుమ్మడి వెంకటరావు

ఎచ్చెర్ల: లావేరు మండలం అప్పాపురం గ్రామానికి చెందిన గుమ్మడి వెంకటరావు (40) కనపించడం లేదని బుధవారం ఆయన భార్య గుమ్మడి నర్సమ్మ లావేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిత్యం మద్యం తాగుతూ బయట తిరుగుతూ ఉంటాడని, రెండు నెలలకు ఒక్కసారి ఇంటికి వస్తాడని ఫిర్యాదులో పెర్కొంది. ఆగస్టు 17వ తేదీ నుంచి ఇంటికి రాలేదన్నారు. లావేరు హెచ్‌సీ పి.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ శాఖ ఏఈలకు బదిలీ

అరసవల్లి:విద్యుత్ శాఖలో నగరానికి చెందిన డీ–1 పరిధి ఏఈగా జె.సురేష్‌కుమార్‌ను, డీ–2 ఎఈగా తిరుపతిరావును నియమిస్తూ సీఎండీ పృద్వీతేజ్ ఆదేశాల ప్రకారం ఉత్తర్వులు జారీ చేశామని విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రకారం డీ–1 ఏఈగా ఉన్నకమల్‌హాసన్‌ను గార మండల ఏఈగా, డీ–2 ఏఈ జె.సురేష్‌కుమార్‌ను డీ–1 ఏఈగా బదిలీ చేశామన్నారు. అలాగే జి.సిగడాం ఏఈ తిరుపతిరావును డీ–2 ఏఈగా నియమించడంతో పొందూరు ఏఈ గా పనిచేస్తున్న పైడి దుర్గాప్రసాద్‌ను జి.సిగడాంకు, ఎచ్చెర్ల నుంచి ఏఈ రమణమూర్తిని పొందూరుకు బదిలీ చేశారు.

అయ్యప్పకు పూజలు



పూజలందుకున్న బలగ అయ్యప్పస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకర నారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు పాల్గొన్నారు. అలాగే పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలో అయ్యప్పస్వామి ఆలయంలో అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

• నగరపాలకసంస్థ కమిషనర్ ప్రసాద్



ప్లాస్టిక్ కవర్ల వినియోగం వద్దంటూ అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ప్రసాద్

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు అన్నారు. పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో వ్యాపారులకు హెచ్చరించారు. పాలిథిన్ కవర్ల నిషేధంలో భాగంగా స్టీల్ బాక్స్‌ను వినియోగిస్తూ కార్యాలయ సిబ్బందికి కమిషనర్ చాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్లో వ్యాపారుల వద్ద ఉన్న పాలిథిన్ కవర్లను తీసుకొని కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలపై వారికి బుధవారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులు వినియోగం వల్ల కాలువలు మూసుకుపోవడం, భూగర్భజలాల కలుషితమవుతుందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యంతో పర్యావరణానికి పెనుముప్పు ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కరిగేందుకు వందేళ్లు పడుతుందని దీనివలన భూగర్భ జలాలు ఇంకిపోయి మానవ మనుగడకే ప్రమాదం వాటిల్లుతోందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, స్టీల్ బాక్సులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు మార్కెట్‌కి వచ్చేటప్పుడు జూట్ సంచెలు, స్టీల్‌బాక్సులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ పి.సుధీర్‌కుమార్, బి.గణేష్‌కుమార్, ఆర్‌ఐలు ఉమామహేశ్వరరావు, నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్‌కు ఘన నివాళి



దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని శక్తి కేంద్ర ప్రముఖ్ ఆధ్వర్యంలో పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జన్మదినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దీనదయాళ్ ఆర్ఎస్ఎస్, బీజేపీకి చేసిన సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ రావడ పురుషోత్తం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు చింతపల్లి దుర్గారావు గాంధీ, గొలివి కరుణాకరరావు, పేడాడ సూర్యకుమారి, పూజారి వెల్లయ్య, మహేష చిన్ననాయుడు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులపాటు నిర్వహించిన చెస్ అండర్ 14, 17, 19 బాలబాలికల పోటీలు ముగిశాయి. అండర్ 14లో 152, అండర్ 17లో 100, అండర్ 19లో 25 మంది హాజరయ్యారు. అండర్ 14 బాలికల విభాగంలో బింధుమాదవి, శృతి, బాలుర విభాగంలో కల్పక్, యశ్వంత్, అండర్ 17 బాలికల విభాగంలో రక్షిత, అలకనంద, బాలుర విభాగం నితిన్, యశ్వంత్, అండర్ 19 బాలుర విభాగంలో వివేక్, ఓంకార్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారు. చెస్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.వి.రమణ, సాంబమూర్తి, హెచ్‌ఎం శ్రీరాములు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పల్లవి, సాయితారక్‌ను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) విద్యార్థులు సీహెచ్ పల్లవి, సాయితారక్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ (తైక్వాండో) పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23వ తేదీన శ్రీకాకుళం పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో పాల్గొని ప్రతిభ కనపర్చారు. ఎంపికైన విద్యార్థులను క్యాంపస్‌లో బుధవారం డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, అధికారులు అభినందించారు.

విద్యారంగ సమస్యలపై ఆరా



పాఠశాలల సందర్శనలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: బహుజన టీచర్స్ అసోషియేషన్ ప్రతినిధులు శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్దానం మండలాలైన కవిటి, కంచిలి, ఇచ్ఛాపురంలోని పలు పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సీపీఎస్/జీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఓటుహక్కు కల్పించాలని, పీఆర్సీ చైర్మన్‌ను తక్షణమే నియమించాలని కోరారు. పాఠశాలలను సందర్శించిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేకేటి రామారావు, జిల్లా అధ్యక్షులు సీర రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కలిగాన ఆనంద్ ఉన్నారు

ఎంఈఓ వైఖరి సరికాదు



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

రణస్థలం: స్థానిక ఎంఈఓ త్రినాధరావు వైఖరిని మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. గొల్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గుంప రమేష్‌కు ఎటువంటి కారణం లేకుండా మెమో అందజేయడం పట్ల సంఘ ప్రతినిధులు మండిపడ్డారు. సక్రమంగా తన వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్న రమేష్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వడంపై సంఘ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓ వైఖరికి నిరసగా త్వరలో దశల వారీతగా ఆందోళనలు చేపడతామన్నారు. ఈ విషయంపై అవసరమైతే ఆర్జేడీ, డీఈఓ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌పీయూ, ఎస్‌జీటీఎఫ్, ఆపస్, బీటీఏ, ఎస్సీ, ఎస్టీ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.